

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్



గురువారం 19 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 168 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ప్రతి కుటుంబాన్ని భాగస్వామ్యం చేయాలి: సీఎస్ సంజయ్ జాజు

సూర్యాపేట, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఈ పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ మరియు ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19న సాయంత్రం సిద్దిపేట జిల్లా నుంచి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారని, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు మరియు మున్సిపల్ వార్డుల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా రాబోయే రెండు వారాల పాటు గ్రామాలు, వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఎవరూ మిగిలిపోకుండా ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులను సేకరించాలని, ముఖ్యంగా బీమా పొందే వ్యక్తి మరియు నామినీ వివరాలను తప్పులు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే పథకం లక్ష్యం, ప్రయోజనాలు మరియు ప్రత్యేక శిబిరాల తేదీలపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికలతో పాటు గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని, కలెక్టర్లు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, డీఎస్ఓ మోహన్ బాబు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెలంగాణను తయారీ, వ్యాపార విస్తరణ కేంద్రంగా మలచుకోండి: ముంబయి పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

హైదరాబాద్/ముంబయి, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ముంబయిలోనే ప్రధాన కార్యాలయాలను కొనసాగిస్తూ, ఉత్పత్తి, తయారీ, సాంకేతికత, ఆవిష్కరణలు మరియు వ్యాపార విస్తరణ కార్యకలాపాలను తెలంగాణలో చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముంబయి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. బుధవారం ముంబయిలోని వర్లీలో ఉన్న ఫోర్ సీజన్స్ హోటల్‌లో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సహకారంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' (ITGS 2026) రోడ్‌షోలో మంత్రి ప్రసంగిస్తూ, ముంబయి నుంచి పెట్టుబడులను తరలించుకురావడం తమ ఉద్దేశం కాదని, అక్కడి ఆర్థిక, కార్పొరేట్ బలాన్ని తెలంగాణలోని తయారీ సామర్థ్యాలతో అనుసంధానించి పరస్పర అభివృద్ధి సాధించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. శతాబ్దం క్రితం తెలంగాణ కార్మికులు, చేతివృత్తులవారు ముంబయి భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములయ్యారని, నేడు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముంబయి పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐటీ, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, ఔషధ పరిశ్రమలు, వస్త్రాలు, మీడియా, వినోద రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని వివరించిన మంత్రి, పెట్టుబడులకు టీజీ-ఐపాస్ ద్వారా వేగంగా అనుమతులు ఇవ్వడమే కాకుండా, ముంబయి నుంచి వచ్చే ప్రతి సంస్థకు మొదటి చర్చల నుంచి ఆదాయం ఆర్జించే దశ వరకు పూర్తి సహకారం అందించేందుకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. 'రైజింగ్ టుగెదర్' నినాదంతో డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ, 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాలకు అనుగుణంగా 2034 నాటికి లక్ష కోట్ల డాలర్లు, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు క్యూర్ (CURE), ప్యూర్ (PURE), రేర్ (RARE) పేరిట మూడు ప్రత్యేక ఆర్థిక మండళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐఐ మహారాష్ట్ర రాష్ట్ర మండలి ఉపాధ్యక్షురాలు ఆర్తి కూచిభట్ల, టీజీఐఐసీ వీసీ అండ్ ఎండీ శశాంక్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొనగా, అనంతరం మంత్రి పలు కంపెనీల ప్రతినిధులతో విడివిడిగా సమావేశమై పెట్టుబడి ప్రతిపాదనలపై చర్చించారు.

నేడు హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన పెన్షన్లు, సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం (నవంబర్ 19) సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో పర్యటించనున్నారు. మంత్రి కార్యాలయం విడుదల చేసిన అధికారిక పర్యటన వివరాల ప్రకారం, ఉదయం 6:30 గంటలకు హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 10:00 గంటలకు హుజూర్‌నగర్ చేరుకుంటారు. అనంతరం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నూతన పెన్షన్లు, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) మరియు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారు. కార్యక్రమం ముగిసిన అనంతరం మధ్యాహ్నం 12:00 గంటలకు హుజూర్‌నగర్ నుంచి తిరుగు ప్రయాణమై మధ్యాహ్నం 3:30 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకుంటారు. మంత్రి పర్యటన నేపథ్యంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు సంబంధిత పోలీస్ కమిషనరేట్ల అధికారులు పటిష్టమైన బందోబస్తు, ప్రోటోకాల్ ఏర్పాట్లు చేపట్టారు.

నవంబర్ 25న ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో జాబ్ మేళా: లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్‌లో 100 ఉద్యోగాల భర్తీ



హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో (UEI&GB/MCC) ఆధ్వర్యంలో లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల నవంబర్ 25వ తేదీన ఉదయం 11 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బ్యూరో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో జరిగే ఈ ఇంటర్వ్యూల ద్వారా లులు మాల్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్, సేల్స్ అసోసియేట్, క్యాషియర్ మరియు కస్టమర్ సర్వీస్ స్పెషలిస్ట్ విభాగాల్లో మొత్తం 100 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయసున్న అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని, ఎంపికైన వారికి రూ.16,000 నుండి రూ.25,000 వరకు నెలవారీ వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నవంబర్ 25న తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో నేరుగా ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయానికి హాజరు కావాలని, మరిన్ని వివరాల కోసం హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాస్ (ఫోన్ నంబర్లు: 8712699096, 8712699097, 7306336001) ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

సూర్యాపేటలో ఘనంగా జిల్లా స్థాయి ఎన్నికల అక్షరాస్యత పోటీలు: రాష్ట్ర స్థాయి పోటీలకు 20 మంది విద్యార్థుల ఎంపిక



సూర్యాపేట, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రక్రియ మరియు పౌర బాధ్యతలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మార్గదర్శకత్వంలో, సూర్యాపేట జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బుధవారం (నవంబర్ 18) జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) నందు జిల్లా స్థాయి ఎన్నికల అక్షరాస్యత (ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ - ELC) పోటీలను నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛమైన మరియు తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ, ఓటరు నమోదు విధానం, ఎన్నికల సంఘం పాత్ర, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) పనితీరు, ఓటింగ్ ప్రక్రియ మరియు ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం వంటి అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించగా, 89-హుజూర్‌నగర్, 90-కోదాడ, 91-సూర్యాపేట, 92-తుంగతుర్తి (ఎస్సీ) నియోజకవర్గాల నుండి మొత్తం 80 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత ముఖ్యమైన బాధ్యత అని, కులం, మతం, ప్రాంతం, భాష మరియు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు వేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ద్వారా విద్యార్థులను కేవలం ఓటు హక్కుపై అవగాహన ఉన్నవారిగా కాకుండా, తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు మరియు సమాజంలో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కలిగించే యువ రాయబారులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు, అడ్డంకులు లేని సమాజమే వికసిత భారత్ లక్ష్యం కావాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



న్యూఢిల్లీ, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): దివ్యాంగులు ఎవరి మీదా ఆధారపడకుండా ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా జీవిస్తూ సమాజంలోని అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందేలా అడ్డంకులు లేని వాతావరణాన్ని నిర్మించడమే 'వికసిత భారత్–2047' లక్ష్యం కావాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ సమక్షంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సులో ఆయన తెలంగాణ తరఫున పాల్గొని 'సుగమ్య భారత్ – వికసిత భారత్' అంశంపై కీలక సూచనలు చేశారు. సుగమ్య భారత్ అభియాన్‌ను కేవలం మౌలిక సదుపాయాల కల్పనకు పరిమితం చేయకుండా దివ్యాంగుల హక్కులు, స్వావలంబనకు భరోసా కల్పించే జాతీయ ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని, కేవలం మెట్రో నగరాలే కాకుండా గ్రామీణ ప్రాంతాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రజా రవాణా వ్యవస్థల్లో ర్యాంపులు, లిఫ్టులు, స్పర్శ ఆధారిత మార్గాలు, ప్రత్యేక మరుగుదొడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ప్రభుత్వ శాఖలో అందుబాటు సాకర్యాల కల్పన, పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించడంతో పాటు వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం–2016 నిబంధనలను పటిష్ఠంగా అమలు చేస్తూ కొత్త భవనాల నిర్మాణ అనుమతుల సమయంలోనే నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చూడాలని ప్రతిపాదించారు. అలాగే ప్రభుత్వ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు దృష్టి, వినికిడి లోపాలున్న వారికి సులభంగా అందుబాటులో ఉండేలా సాంకేతిక మార్పులు చేయాలని, దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలు, ప్రజా ప్రదేశాల్లోని సాకర్యాల స్థితిని ఫొటోలతో నమోదు చేస్తూ, దివ్యాంగుల ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు సమగ్ర జాతీయ డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగ సంస్థల్లోనూ దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం, ఉపాధి అవకాశాలు పెంపొందించాలని, ఈ సదుపాయాలు వయోవృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని పేర్కొంటూ, దివ్యాంగుల సాధికారత కోసం కేంద్రం తీసుకునే చర్యలకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు.

పట్టభద్రుల ఓటరు జాబితా రూపకల్పనను పకడ్బందీగా పూర్తి చేయాలి: ఈసీ కార్యదర్శి సుమన్ కుమార్ దాస్

సూర్యాపేట, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): పట్టభద్రుల శాసనమండలి (ఎమ్మెల్సీ) నియోజకవర్గాల ఓటరు జాబితాల నూతన రూపకల్పన (డి-నోవో) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ దాస్ అధికారులకు సూచించారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి ఆయన మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాల తయారీ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించగా, సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈసీ కార్యదర్శి మాట్లాడుతూ, పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం-18 దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ బల్క్‌గా (సామూహికంగా) స్వీకరించరాదని స్పష్టం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, దరఖాస్తుదారుల అర్హతలు మరియు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, తద్వారా అర్హులైన పట్టభద్రులందరి పేర్లు జాబితాలో నమోదయ్యేలా చూడటంతో పాటు అనర్హుల పేర్లు చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీవోలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఎలక్షన్ సెల్ సిబ్బంది రాజేంద్ర రెడ్డి, భరత్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల అమలుపై సీఎస్ సంజయ్ జాజు కీలక సమీక్షలు

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): జంటనగరాల్లో పెరుగుతున్న ప్రజా రవాణా అవసరాలను తీర్చేందుకు పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (PRTS) ఏర్పాటుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంతో పాటు, ప్రతిష్టాత్మక ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీనియర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన PRTS ప్రతిపాదనలపై సమీక్షిస్తూ, మొదటి దశలో కూకట్‌పల్లి, రాయదుర్గం, బయోడైవర్సిటీ మీదుగా నాలెడ్జ్ సిటీ వరకు 35 కిలోమీటర్ల మేర 64 స్టేషన్లతో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు HMRL సిద్ధం చేసిన ప్రణాళికను పరిశీలించి, ఇప్పటికే ఉన్న రవాణా మౌలిక సదుపాయాలను గరిష్ఠంగా వినియోగించుకుంటూ కనీన వ్యయంతో, మెట్రో, ఆర్టీసీ, GRT తదితర రవాణా మార్గాలతో సమన్వయం చేస్తూ సమగ్ర రూట్ మ్యాప్ రూపొందించాలని HMRL ఎండీ నర్వరాజ్ అహ్మద్, సలహాదారు ఎన్.వి.ఎన్. రెడ్డి మరియు సంబంధిత భాగస్వామ్య శాఖల అధికారులకు సూచించారు. అనంతరం సచివాలయం నుంచే జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కోసం రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం నేతన్న, గౌడ, కార్మిక, మత్స్యకారులకు అమలులో ఉన్న రూ.2 లక్షల జీవిత బీమాను ఈ పథకం గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా బీమా పరిమితి రూ.5 లక్షలకు పెరుగుతుందని స్పష్టం చేస్తూ, నెలరోజుల పాటు కొనసాగే ఈ నమోదు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడంతో పాటు ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి నందీప్ కుమార్ సుల్తానియా, పౌర సరఫరాల కమిషనర్ నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం, షీ-టీమ్స్, భరోసా సెంటర్ల డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సౌమ్య మిశ్రా, జైళ్ల శాఖ డీజీపీగా బాధ్యతలు చేపట్టిన స్వాతి లక్రా సచివాలయంలో సీఎస్ సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిశారు.



ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ప్రతిష్టాత్మక 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు పంపిన ఆహ్వానాలు మరియు ఇప్పటివరకు అందిన నిర్ధారణల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆహ్వానాల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ అతిథులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సదస్సులో పాల్గొనే ప్రతినిధుల (డెలిగేట్స్) నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు వీలుగా రిజిస్ట్రేషన్లను ప్రత్యేకంగా చేపట్టాలని, తద్వారా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎస్ స్పష్టం చేశారు. అలాగే సదస్సు వేదిక, ఎరీనా డిజైన్ మరియు అక్కడ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఆయన, అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సదస్సును అత్యంత ఘనంగా, ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

సంగారెడ్డిలో మహిళలు, బాలికలకు ఉచిత కంప్యూటర్, టాలీ శిక్షణ కార్యక్రమం ప్రారంభం



సంగారెడ్డి, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా కేంద్ర ప్రభుత్వ 'బేటీ బచావో – బేటీ పడావో' పథకంలో భాగంగా అర్హులైన మహిళలు, బాలికలకు ఉచిత కంప్యూటర్ మరియు టాలీ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం జిల్లా సంక్షేమ అధికారిణి కె. లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక ప్రపంచంలో కంప్యూటర్ నైపుణ్యాలు ఎంతో అవసరమని, బాలికలు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం సంగారెడ్డి తహసీల్దార్ జయరాం మాట్లాడుతూ, మహిళా సాధికారతలో విద్య, ఆర్థిక స్వావలంబన మరియు నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త పల్లవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఐశ్వర్య, జి.ఎస్. విశాల, ట్రైనర్ మౌనిక, మహిళలు మరియు బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమంలో ముందున్నాం.. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేశాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసి చూపించిన తొలి రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ (MCRHRD)లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే మరియు కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో సీఎం పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలతో పాటు రాజకీయంగా అత్యధిక అవకాశాలు కల్పించామని, శాసనసభ స్పీకర్‌గా, మంత్రులుగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరియు వివిధ కార్పొరేషన్లలో సముచిత స్థానం కల్పించామని తెలిపారు. వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా దళితుడికి అవకాశం ఇవ్వడంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐటీలలో ఎస్సీ, ఎస్టీలకు వీసీలుగా నియమించామని, అర్హత ఉన్న ప్రతిచోటా వారికి ప్రాధాన్యత ఇచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని, సీఎంఆర్ఎఫ్ మరియు ఆరోగ్యశ్రీ నిధుల్లో 50 శాతానికి పైగా ఈ వర్గాల కోసమే ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడంపై పార్లమెంటరీ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కమిటీ సభ్యులు తాపీర్ గావ్, హరీశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటరీ కమిటీకి ఘన స్వాగతం పలికిన సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో అధికారిక అధ్యయన పర్యటన నిమిత్తం బుధవారం (నవంబర్ 18) హైదరాబాద్ విచ్చేసిన ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే మరియు కమిటీ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తాజ్ కృష్ణ హోటల్‌లో ఘన స్వాగతం పలికారు. కమిటీ సభ్యులైన ఎంపీలు తాపీర్ గావ్, బాపి హల్దార్, హరీశ్చంద్ర మీనా, దగ్గుమళ్ల ప్రసాద రావు, డాక్టర్ మల్లు రవి, మిథిలేష్ కుమార్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్, హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్ మరియు ఇతర ఉన్నతాధికారులు కమిటీ చైర్మన్, సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



పోక్సో, ఎంటీపీ, బాలల రక్షణ చట్టాలపై వైద్యులకు అవగాహన కార్యక్రమం: బాధిత బాలలకు తక్షణ వైద్య సహాయం అందించాలి - జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య

సంగారెడ్డి, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మహిళా ప్రాంగణంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం మరియు మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు, శిశు వైద్యులకు బుధవారం పోక్సో చట్టం–2012, ఎంటీపీ (MTP) చట్టం మరియు బాలల రక్షణ చట్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు వయస్సు గల వారందరినీ పోక్సో చట్టం ప్రకారం బాలలుగా పరిగణిస్తారని, బాలలపై జరిగే లైంగిక నేరాల నివారణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం బాలలపై లైంగిక నేరం జరిగినట్లు తెలిసినా లేదా అనుమానం కలిగినా వెంటనే పోలీసులకు లేదా స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్‌కు తప్పనిసరిగా సమాచారం అందించాలని, సెక్షన్ 21 ప్రకారం సమాచారం ఇవ్వడంలో విఫలమైతే చట్టపరమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. సెక్షన్ 27 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే బాధితులకు ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్య సహాయం అందించాలని, బాలికలైతే మహిళా వైద్యురాలితో పరీక్షలు నిర్వహించి ఫోరెన్సిక్ ఆధారాలను భద్రపరచాలని, బాధిత బాలల పేరు, చిరునామా వంటి గోప్యతను కాపాడుతూ కౌన్సెలింగ్, పునరావాస సేవల కోసం సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే ఎంటీపీ చట్ట నిబంధనలు, ఇన్-కెమెరా పద్ధతిలో జరిగే ప్రత్యేక న్యాయస్థానాల విచారణ విధానాలను వివరించిన ఆమె, బాలలపై నేరాలను అరికట్టేందుకు వైద్యులు, పోలీసు, న్యాయ, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రాజా రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ లలిత, పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ వేడుకల నేపథ్యంలో సంగారెడ్డిలో ఓయూ డా. బి.ఆర్. అంబేద్కర్ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు

సంగారెడ్డి, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): నవంబర్ 26న జరగనున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన డా. బి.ఆర్. అంబేద్కర్ పరిశోధనా కేంద్రం మరియు సంగారెడ్డిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల న్యాయ కళాశాల (పురుషులు) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం మార్గదర్శకత్వం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వీసీ ఓఎస్డీ సీనియర్ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. లింగప్ప మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ తత్వాన్ని జిల్లా, గ్రామ స్థాయి విద్యార్థులకు చేరువ చేయాలనే ఉపకులపతి సంకల్పానికి అనుగుణంగా ఈ విస్తరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డా. చలమల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడిగా డా. అంబేద్కర్ అందించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పునాది విలువలను యువత పరిరక్షిస్తూ సమ్మిళిత భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డా. చి. శ్రీనివాస్ యాదవ్ పోటీల వివరాలను వెల్లడిస్తూ, సుమారు 18 పాఠశాలలు, కళాశాలల్లో ప్రాథమిక ఎంపిక పోటీలు నిర్వహించి తుది పోటీలకు విద్యార్థులను ఆహ్వానించామని, ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు పురస్కారాలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్కొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లను ఆదేశించగా, సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, అదనపు డీఆర్డీవో సూర్యారావు, డీపీవో మల్లారెడ్డి, ఈడీఎం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తూ, 18 నుంచి 59 ఏళ్ల వయసున్న అర్హులందరికీ ఈ పథకం ప్రయోజనం అందేలా జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో విడతల వారీగా ప్రత్యేక నమోదు శిబిరాలు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శిబిరాల్లో అర్హుల నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలతో పాటు నామినీ వివరాలను స్పష్టంగా సేకరించి, దరఖాస్తు పత్రంపై సంతకం తీసుకోవాలని, ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక శిబిరాల వద్ద ప్రచార ఫ్లెక్సీలు, తాగునీటి సదుపాయం, కంప్యూటర్లు, సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రతి గ్రామంలో ముందస్తుగా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రత్యేక అధికారులు ఈ శిబిరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.



చలో సిద్దిపేట సభను విజయవంతం చేయాలి: నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): నవంబర్ 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు కలిపి సుమారు ఐదు వేల మందితో సిద్దిపేట సభకు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ఆవిష్కరించనున్నారని, ఈ పథకం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు కొండంత ఆర్థిక భరోసా కల్పించే దిశగా కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజలను పెద్ద సంఖ్యలో సమీకరించి 'చలో సిద్దిపేట' కార్యక్రమాన్ని ఘనవిజయం చేయాలని ఆవుల రాజిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌తో పాటు పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎనిమిది గంటల్లోనే ట్రాక్టర్ చోరీ కేసును ఛేదించిన రాయికోడ్ పోలీసులు.. ట్రాక్టర్ స్వాధీనం, నిందితుడి అరెస్ట్

రాయికోడ్, నవంబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాక్టర్ చోరీ కేసును పోలీసులు కేవలం ఎనిమిది గంటల్లోనే ఛేదించి దొంగిలించబడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే రాయికోడ్ గ్రామానికి చెందిన హల్చిగె చంద్రశేఖర్ తండ్రి శివప్పకు చెందిన మహీంద్రా యువ 575 మోడల్ ఎరుపు రంగు ట్రాక్టర్ (నంబర్ TS17 4674)ను ఈ నెల 16వ తేదీ రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేయగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవంబర్ 17న రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ట్రాక్టర్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 17వ తేదీ రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో మెదక్ జిల్లా టేక్మాల్ మండలం నారాయణరావుపేట సమీపంలోని తండా వద్ద చోరీకి గురైన ట్రాక్టర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తీరత్ ఠాకూర్ (తండ్రి సైని ఠాకూర్)ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన ఎనిమిది గంటల్లోనే కేసును ఛేదించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని స్టేషన్ హౌస్ ఆఫీసర్ అభినందించారు. ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌ఓ సూచించారు.

చింతకాని మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన లింగాల కమల్ రాజు.. బాధితులకు పరామర్శ, వివాహ రిసెప్షన్‌కు హాజరు



చింతకాని, నవంబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు బుధవారం చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా తిమ్మినేనిపాలెం గ్రామానికి చేరుకుని బీఆర్ఎస్ పార్టీ ఏడో వార్డు సభ్యురాలు గుగ్గిల ఆదిలక్ష్మి భర్త గుగ్గిల వెంకన్నను, చింతల సీతయ్యను పరామర్శించారు. అనంతరం చిన్నమండవ గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కొమ్ము కృష్ణయ్యను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వంకాయలపాటి నత్యనారాయణ కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సర్పంచ్ కొమ్ము ప్రభు, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, గడ్డం శ్రీను, పానుగోటి రత్నాకర్, షేక్ మదార్, బండి రామారావు, కోపూరి నవీన్, నాదెండ్ల వెంకటేష్, షేక్ మీరా సాహెబ్, కాలంగి డేవిడ్, తునికిపాటి పూర్ణచంద్రరావు, కూచిపూడి సురేష్, సామినేని జమలయ్య, నాదెండ్ల జయరాజ్, చింతల సీతయ్య, దారెల్లి రాజరత్నం, నాదెండ్ల సైదులు, తెల్లగొర్ల నత్యనారాయణ, మరీదు లక్ష్మీనారాయణ, మరీదు నరసింహారావు, మరీదు నరేష్, కందిమల్ల శ్రీను, కాసిమాల ఫ్రాన్సిస్, నాగరాజు, వెంకట రాములు, వరసగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి-65పై వాహన తనిఖీలను పరిశీలించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ: రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా నిరంతర తనిఖీలు

సూర్యాపేట, నవంబర్ 19, సందేశం టైమ్స్ (జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణా మరియు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్పష్టం చేశారు. బుధవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-65పై జనగామ క్రాస్ రోడ్ వద్ద పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీలను ఆయన ఆకస్మికంగా పరిశీలించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల సమయంలో పోలీసులు తగిన జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా రేడియం రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని, రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేసి ఆక్రమణలకు పాల్పడితే ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. వ్యాపారులు, దుకాణదారులు తమ వ్యాపార ప్రాంగణాల్లో 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్తులను త్వరగా గుర్తించేందుకు పోలీసులకు ఎంతో సహకారం అందుతుందని పేర్కొంటూ, రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో చెక్‌పోస్ట్ ఏర్పాటు: అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా



చింతకాని, నవంబర్ 19, సందేశం టైమ్స్ (చింతకాని ప్రతినిధి): తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలో అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు చింతకాని మండలం చిన్నమండవ గ్రామ సమీపంలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వద్ద ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు చింతకాని ఎస్సై గజ్జల నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరిహద్దు మార్గం గుండా అక్రమంగా ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి వంటి నిషేధిత వస్తువుల రవాణాకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్ట్ వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పర్చ రామచంద్రరావు మాట్లాడుతూ, సరిహద్దు ప్రాంతంలో ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొంటూ, ప్రజల భద్రత కోసం చర్యలు తీసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు, చింతకాని ఎస్సై గజ్జల నరేష్‌కు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్.. 200 మోడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంసం.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: డీఎస్పీ సత్యయ్య గౌడ్



సంగారెడ్డి, నవంబర్ 19(సందేశం టైమ్స్ ప్రతినిధి): ద్విచక్ర వాహనాలకు కంపెనీ అమర్చిన సైలెన్సర్లను తొలగించి అధిక శబ్దాలు వచ్చే మోడిఫైడ్ సైలెన్సర్లను అమర్చుకుని రోడ్లపై తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఆకతాయిలపై సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మోడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న సుమారు 200 ద్విచక్ర వాహనాలను గుర్తించి మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. ఆయా వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సుమారు 200 మోడిఫైడ్ సైలెన్సర్లను రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యయ్య గౌడ్ మాట్లాడుతూ వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకుని పెద్ద శబ్దాలతో రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం సహించేది లేదని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే వారిపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను గుర్తించి సైలెన్సర్లను తొలగించడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడం, రోడ్లపై క్రమశిక్షణ పెంపొందించడం పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, రూరల్ సీఐ నయీముద్దీన్, టౌన్ సీఐ రాము నాయుడు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చింతకానిలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్ట్.. 1.065 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం

చింతకాని, నవంబర్ 19 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1 కిలో 65 గ్రాముల ఎండు గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 17వ తేదీ రాత్రి చింతకాని మండలంలోని తుమ్మలమ్మ చెరువు కట్ట వద్ద ఎస్ఐ జి. నరేష్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి సుమారు రూ.53,250 విలువైన 1 కిలో 65 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నేరానికి ఉపయోగించిన నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ కేసులో కొమ్ము ప్రణయ్, పెశెట్టి శ్రీశాంత్, మహ్మద్ అబ్దుల్ ఆదిల్, షేక్ అక్మల్, పెనుగొండ సాయిలను అరెస్ట్ చేశారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న టీన్ను అలియాస్ వినయ్, షఫీ, జావేద్, ఖాజా, శ్రీకాంత్, ప్రకాష్ నగర్ సాయిలకు సంబంధించిన వివరాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి. నరేష్ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాగులవంచలో వివాహ విందు.. సందడి చేసిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు



చింతకాని, నవంబర్ 19(సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వంకాయలపాటి సత్యనారాయణ కుమారుడు మోహన్ వివాహ వేడుకలను పురస్కరించుకుని బుధవారం వంకాయలపాటి రామయ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వివాహ విందు కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు హాజరై నూతన వరుడు మోహన్‌కు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన దంపతుల జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ బందేల నాగార్జున్, విశ్రాంత గెజిటెడ్ ఉపాధ్యాయులు అంబటి శాంతయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆలస్యం శంకర్, గ్రామస్తులు వంకాయలపాటి కల్యాణ్, ఎండీ కాశీం, శీలం స్వామి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ హామీలు నీటి మూటలే.. మూడేళ్ల పాలనలో ప్రజలకు నిరాశే! పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో రాజకీయ పక్షపాతం తగదు: మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు

చింతకాని, నవంబర్ 19(సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఖమ్మం జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 400 హామీల పేరుతో ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని విస్మరించిందని ఆరోపించారు. పేరుకు ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టిందని విమర్శించారు. కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీలో గ్రామ సర్పంచులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు కనీస సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి సమయంలో కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా పత్రాలు పంపిణీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచులకు కనీస గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడం సరికాదని, ప్రభుత్వ పథకాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే అందిస్తున్నట్లుగా ప్రచారం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలోనూ రాజకీయ పక్షపాతం చూపుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని, నిజమైన నిరుపేదలు, గుడిసెల్లో నివసించే పేదలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి పేదవారికి పార్టీలు, జెండాలతో సంబంధం లేకుండా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని, రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15 వేల రైతుభరోసా, కౌలు రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళలకు ఇచ్చిన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు వంటి పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని లింగాల కమల్ రాజు డిమాండ్ చేశారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో పక్షపాత ధోరణిని విడనాడి పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

రిసార్ట్‌లో బంగారు ఆభరణాలు, నగదు చోరీ: రూ.1.66 లక్షల విలువైన సొత్తు అపహరణ.. భద్రతా వైఫల్యంపై యాజమాన్యంపై ఆరోపణలు

నర్సాపూర్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంకారా మృగవాణి రిసార్ట్‌లో బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన వడపల్లి రామకృష్ణ (37) ఈ నెల 14వ తేదీన తన కుటుంబ సభ్యులతో కలిసి రిసార్ట్‌కు వెళ్లి బస చేయగా, తన హ్యాండ్ బ్యాగులో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, నగదు కనిపించకపోవడంతో పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. అపహరణకు గురైన బంగారు ఆభరణాలు, నగదు విలువ సుమారు రూ.1.66 లక్షలు ఉంటుందని, అతిథుల భద్రత విషయంలో రిసార్ట్ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని బాధితుడు ఆరోపిస్తూ రిసార్ట్ యాజమాన్యంపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. బుధవారం (నవంబర్ 18) బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నర్సాపూర్ పోలీసులు క్రైమ్ నంబర్ 358/2026, బీఎన్ఎస్ సెక్షన్ 305 కింద కేసు నమోదు చేసి, చోరీ జరిగిన పరిస్థితులు, రిసార్ట్‌లోని భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



ఛలో సిద్దిపేట సభను విజయవంతం చేయాలి.. కాంగ్రెస్ శ్రేణులకు ఆవుల రాజిరెడ్డి పిలుపు

నర్సాపూర్, నవంబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర హాల్‌లో నిర్వహించిన ఛలో సిద్దిపేట కార్యక్రమ సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయ్ కుమార్, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శోభారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో సిద్దిపేటకు తరలివచ్చి ఛలో సిద్దిపేట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉద్యమకారుల ఐక్యతను చాటాలి.. ఈనెల 22న మేడారం సభను విజయవంతం చేయాలి: డాక్టర్ చీమ శ్రీనివాస్

కోదాడ, నవంబర్ 19 (సందేశం టైమ్స్ నూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కృషి చేస్తోందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు నివాసంలో ఫోరం నూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు హాజరై మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని, త్వరలో ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆ వెబ్‌సైట్‌లో ఉద్యమకారులందరూ తమ పేర్లు, కేసుల వివరాలు, బైండోవర్ వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ ఆదివారం మేడారంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని, నూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలంగాణ ఉద్యమకారులు ఏనుగుల యల్లేశ్వరరావు, పోలంపల్లి వెంకటేశ్వర్లు, కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, ఎద్దు యాదగిరి, బోయినపల్లి సత్యనారాయణ, నారబోయిన సత్యనారాయణ, కటారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గ ఐక్యతే SWF ధ్యేయం.. హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు



కోదాడ, నవంబర్ 19 (సందేశం టైమ్స్ నూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): దోపిడీకి గురవుతున్న కార్మిక వర్గాన్ని ఐక్యపరిచి, వారి హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం చేయడమే స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (SWF) ప్రధాన ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు అన్నారు. ఐక్యత, పోరాటాలే పునాదిగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం SWF అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. కోదాడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నల్గొండ రీజియన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న నాయకత్వ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని 'SWF విశిష్టత – నిర్మాణం' అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా వి.ఎస్. రావు మాట్లాడుతూ 1979లో 'ఐక్యత – పోరాటం' అనే నినాదంతో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మిక వర్గ ఐక్యతే లక్ష్యంగా సంఘం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, యాజమాన్యాల నుంచి ఎదురవుతున్న సవాళ్లపై ఐక్యంగా పోరాడినప్పుడే హక్కులను సాధించుకోగలమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత శక్తిని పెంపొందించుకోవాలని, ప్రతి కార్మికుడిలో సంఘీభావం, పోరాట స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. సంఘ నిర్మాణం, లక్ష్యాలు, బాధ్యతలు, నాయకత్వ లక్షణాలు, కార్మిక ఉద్యమంలో కార్యకర్తల పాత్ర తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్మిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇలాంటి శిక్షణ తరగతులు కీలక పాత్ర పోషిస్తాయని నాయకులు పేర్కొన్నారు. శిక్షణ తరగతుల ప్రారంభం సందర్భంగా SWF రీజియన్ అధ్యక్షుడు కె. నర్సింహా ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించి, అనంతరం శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోటగిరి వెంకట్ నారాయణ, ఉపాధ్యక్షుడు రాంబాబు, టౌన్ కన్వీనర్ ఎం. ముత్యాలు, SWF రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, రీజియన్ నాయకులు శ్రీకంఠం, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణయ్య, యాదవ్వ, శ్రీదేవి, అంజలి, ఉపేందర్, రామానుజమ్మ, ఏఎస్ రావు, లక్ష్మణ్, రామనాథం, రాములు, బాలయ్య, కె.వి. రెడ్డి, వెంకటేష్, రవి, కె.ఎన్. రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు 30 బస్సుల కేటాయింపు.. నారాయణఖేడ్ డిపో పరిధిలో తాత్కాలికంగా కొన్ని బస్సు సర్వీసులకు అంతరాయం



నారాయణఖేడ్, నవంబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సిద్దిపేటలో గురువారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి 30 బస్సులను సభకు కేటాయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ కారణంగా నారాయణఖేడ్ డిపో పరిధిలోని వివిధ గ్రామాలకు నడిచే కొన్ని బస్సు సర్వీసులు తాత్కాలికంగా అందుబాటులో ఉండకపోవచ్చని వెల్లడించారు. ప్రయాణికులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. బస్సు సర్వీసుల్లో తాత్కాలిక మార్పుల కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు సహకరించాలని నారాయణఖేడ్ డిపో అధికారులు విజ్ఞప్తి చేశారు.



శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామిని దర్శించుకున్న జహీరాబాద్ ఆర్డీఓ, రాయికోడ్ తహసీల్దార్

రాయికోడ్, నవంబర్ 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి దేవస్థానాన్ని బుధవారం జహీరాబాద్ ఆర్డీఓ దేవుజ, రాయికోడ్ తహసీల్దార్ ఆశాజ్యోతి సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరయ్య స్వామి, బసవ స్వామి అధికారులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ రికార్డు అసిస్టెంట్ ఇందూరి కృష్ణ, బసవరాజ్‌తో పాటు ఆలయ సిబ్బంది అధికారులకు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారి ఆశీస్సులు పొందిన అధికారులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.



అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరుకుంది: సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): గతేడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ గాట్విక్ విమానాశ్రయానికి బయలుదేరి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ (ఫ్లైట్ AI171) విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరుకుందని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. ఈ ఘోర దుర్ఘటనపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ మృతుడైన పైలట్ కెప్టెన్ సుమీత్ సబర్వాల్ తండ్రి పుష్కర్ రాజ్ సబర్వాల్ మరియు 'సేఫ్టీ మ్యాటర్స్ ఫౌండేషన్' దాఖలు చేసిన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) దర్యాప్తు చివరి దశలో ఉందని, అంతర్జాతీయ ప్రోటోకాల్స్ పాటించాల్సి ఉన్నందున ఉద్దేశపూర్వకంగా ఎలాంటి జాప్యం చేయడం లేదని పేర్కొంటూ విచారణను రెండు నుంచి మూడు వారాల పాటు వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ స్పందిస్తూ, తుది నివేదిక ఇంకా బహిర్గతం కాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకురాగా, అనంతరం సుప్రీంకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. కాగా, 2025 జూన్ 12న జరిగిన ఈ ప్రమాదంలో విమానంలోని 242 మందిలో 241 మంది ప్రయాణికులు, సిబ్బందితో పాటు భూమిపై ఉన్న మరో 19 మంది కలిపి మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

దూసుకొస్తున్న 'అక్వాన్': రేపు మధ్యాహ్నం ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో తీరం దాటే అవకాశం.. ఉత్తరాంధ్రకు అతి భారీ వర్ష సూచన

విశాఖపట్నం/శ్రీకాకుళం, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'సైక్లోన్ అక్వాన్' ప్రస్తుతం తీవ్ర వాయుగుండంగా మారి ఉత్తర-వాయువ్య దిశగా కదులుతోందని, ఇది నవంబర్ 20వ తేదీ మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ - ఒడిశా సరిహద్దు సమీపంలోని ఇచ్ఛాపురం - బరంపురం ప్రాంతానికి అతి దగ్గరగా బలహీన వాయుగుండం లేదా అల్పపీడనంగా తీరం దాటే అవకాశం ఉందని ఏపీ వెదర్ మ్యాన్ తాజాగా కీలక అప్‌డేట్ విడుదల చేశారు. ఈ తుఫాను ప్రభావంతో నవంబర్ 19 మరియు 20 తేదీలలో శ్రీకాకుళం నగరం నుండి ఒడిశాలోని చిలక సరస్సు వరకు ఉన్న సరిహద్దు తీర ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. అదే సమయంలో విశాఖపట్నం, విజయనగరం నగరాలు మరియు వాటి పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా పొడిగా ఉండి చల్లని రాత్రులు, పొగమంచుతో కూడిన ఉదయపు వాతావరణం నెలకొంటుందని వెల్లడించారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లాల కేటాయింపు: ఉత్తర్వులు జారీ

HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD

Subject: In supercession of the earlier orders, allocation of the Districts to the Hon'ble Judges shall be as under with effect from **17.11.2026**:

Sl. No.	Name of the Hon'ble Judge Sri/Smt./Kum.	Name of the District(s)
1.	Justice Moushumi Bhattacharya	Hyderabad
2.	Justice K. Lakshman	Rangareddy
3.	Justice B. Vijaysen Reddy	Medchal-Malkajgiri
4.	Justice N. Tukaramji	Hanumakonda & Warangal
5.	Justice Tangirala Madhavi Devi	Nalgonda
6.	Justice Surepalli Nanda	Karimnagar
7.	Justice Juvvadi Sridevi	Nizamabad & Kamareddy
8.	Justice N.V. Shravan Kumar	Khammam
9.	Justice C.V. Bhaskar Reddy	--
10.	Justice E.V. Venugopal	Sangareddy
11.	Justice Nagesh Bheemapaka	Jagtial & Siricilla
12.	Justice Pulla Karthik	Peddapally & Bhupalapally
13.	Justice K. Sarath	Suryapet
14.	Justice J. Sreenivas Rao	Mancherial & Asifabad
15.	Justice Namavarapu Rajeshwar Rao	Mahabubnagar & Narayanpet
16.	Justice Laxmi Narayana Alishetty	Siddipet
17.	Justice Anil Kumar Jukanti	Bhongir
18.	Justice K. Sujana	Kothagudem
19.	Justice Renuka Yara	Wanaparthy & Gadwal
20.	Justice Narsing Rao Nandikonda	Vikarabad
21.	Justice B.R.Madhusudhan Rao	Adilabad & Nirmal
22.	Justice G.M. Mohiuddin	Mahabubabad & Mulugu
23.	Justice V. Ramakrishna Reddy	Nagarkurnool
24.	Justice S. Chalapathi Rao	Medak
25.	Justice Gadi Praveen Kumar	Jangaon

Date: 16-11-2026

REGISTRAR GENERAL

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) పరిధిలోని న్యాయమూర్తులకు వివిధ జిల్లాల పరిపాలనా బాధ్యతలను (పోర్ట్‌ఫోలియో జడ్జీలుగా) కేటాయిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఉత్తర్వులను రద్దు చేస్తూ నవంబర్ 17వ తేదీ నుండి తక్షణమే అమల్లోకి వచ్చేలా జారీ చేసిన ఈ నూతన కేటాయింపుల ప్రకారం, జస్టిస్ మౌషుమి భట్టాచార్యకు హైదరాబాద్, జస్టిస్ కె. లక్ష్మణ్‌కు రంగారెడ్డి, జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డికి మేడ్చల్-మల్కాజిగిరి, జస్టిస్ ఎన్. తుకారాంజీకి హనుమకొండ & వరంగల్, జస్టిస్ తంగిరాల మాధవీ దేవికి నల్గొండ, జస్టిస్ సురేపల్లి నందాకు కరీంనగర్, జస్టిస్ జువ్వాడి శ్రీదేవికి నిజామాబాద్ & కామారెడ్డి, జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్‌కు ఖమ్మం, జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డికి సంగారెడ్డి, జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్‌కు జగిత్యాల & సిరిసిల్ల, జస్టిస్ పుల్ల కార్తీక్‌కు పెద్దపల్లి & భూపాలపల్లి, జస్టిస్ నగేష్ భీమపాకకు సూర్యాపేట జిల్లాలను కేటాయించారు. అలాగే జస్టిస్ కె. శరత్‌కు మంచిర్యాల & ఆసిఫాబాద్, జస్టిస్ జె. శ్రీనివాస్ రావుకు మహబూబ్‌నగర్ & నారాయణపేట, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావుకు సిద్దిపేట, జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టికి భువనగిరి, జస్టిస్ అనిల్ కుమార్ జుకంటికి కొత్తగూడెం, జస్టిస్ కె. సుజనకు వనపర్తి & గద్వాల, జస్టిస్ రేణుక యారాకు వికారాబాద్, జస్టిస్ నర్సింగ్ రావు నందికొండకు ఆదిలాబాద్ & నిర్మల్, జస్టిస్ బి.ఆర్. మధుసూదన్ రావుకు మహబూబాబాద్ & ములుగు, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌కు నాగర్‌కర్నూల్, జస్టిస్ వి. రామకృష్ణ రెడ్డికి మెదక్, జస్టిస్ ఎస్. చలపతి రావుకు జనగామ జిల్లాల బాధ్యతలను అప్పగిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ప్రకటన విడుదల చేశారు.

సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాద్ నూతన సీపీ మహేష్ భగవత్



హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ మహేష్ భగవత్ బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపిన నూతన సీపీ, నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి మరియు ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ సేవలు అందించేందుకు తీసుకోనున్న చర్యలపై కొద్దిసేపు చర్చించారు. నూతన బాధ్యతలు చేపట్టిన మహేష్ భగవత్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలుపుతూ, హైదరాబాద్ నగర భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.



నువ్వేం సీఎంవి? నీదేం భాష?: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్/మునుగోడు, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): నియోజకవర్గాల అభివృద్ధి మరియు నిధుల కేటాయింపు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తీవ్ర పక్షపాతం చూపిస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ సీఎం తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం అయన మాట్లాడుతూ, అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి, కొడంగల్ తరహాలో మునుగోడు నియోజకవర్గానికి నిధులు ఇవ్వాలని అడిగితే 'పండబెట్టి తొక్కుతా' అంటూ మాట్లాడటం ఆయన హోదాకు తగదని, అసలు ఇదేం భాష అంటూ మండిపడ్డారు. నువ్వు తొక్కితే తొక్కించుకునేలా కనిపిస్తున్నానా అని ప్రశ్నించిన ఆయన, అధికారం ఉందని ఏం చేసినా నడుస్తుందని అనుకుంటే 'ఖబర్దార్ బిడ్డా.. యుద్ధం మొదలవుతుంది' అంటూ ఘాటుగా హెచ్చరించారు. తెలంగాణ అంటే కేవలం కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ మాత్రమే కాదని, కొడంగల్‌కు రూ.10 వేల కోట్ల నిధులు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి మునుగోడుకు కనీసం రూ.500 కోట్లు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉన్న హైదరాబాద్ నగరానికే దిక్కులేకపోతే కొత్తగా 'ఫ్యూచర్ సిటీ' ఎందుకని, దాని కోసం వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటని ఆయన నిలదీశారు. ఎన్నికల సమయంలో రూ.4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ఆవేదన వ్యక్తం చేసిన రాజగోపాల్ రెడ్డి, మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజల సమస్యలు అలాగే ఉన్నాయని, మునుగోడుకు రావాల్సిన వాటా నిధులు ఇవ్వకపోతే రాబోయే రోజుల్లో మరో కురుక్షేత్రం తప్పదని స్పష్టం చేశారు.



నేడు ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారిక ప్రారంభం: ప్రారంభించనున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ఖమ్మం, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచే ప్రతిష్టాత్మక ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి (NH-365BG) గురువారం (నవంబర్ 19) అధికారికంగా ప్రారంభం కానుంది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఈ నూతన గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభోత్సవం జరగనుంది. ఈ ప్రారంభోత్సవంతో పాటు ఖమ్మం–కురవి జాతీయ రహదారి (NH-365A) విస్తరణ, నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించనున్నారు. సుమారు 162 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి రావడం ద్వారా హైదరాబాద్–విశాఖపట్నం మధ్య ప్రయాణ దూరం సుమారు 56 కిలోమీటర్ల మేర తగ్గడంతో పాటు, ఖమ్మం జిల్లా వాసులకు మరియు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.



చెక్ బౌన్స్ కేసులో నిర్మాత బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.95 లక్షల జరిమానా విధిస్తూ ఒంగోలు కోర్టు సంచలన తీర్పు

ఒంగోలు/హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ప్రముఖ టాలీవుడ్ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు చెక్ బౌన్స్ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు కోర్టు బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి మద్దిరాలపాడుకు చెందిన జెట్టి వెంకటేశ్వర్లు (వెంకటేశ్వరరావు) వద్ద రూ.95 లక్షల అప్పు తీసుకున్న బండ్ల గణేశ్, ఆ మొత్తానికి తన నిర్మాణ సంస్థ ‘పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్’ పేరిట రూ.95 లక్షల విలువైన చెక్కును అందజేశారు. అయితే బ్యాంక్ ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ బౌన్స్ కావడం, నగదు చెల్లింపు విషయంలో పలుమార్లు కోరినా స్పందించకపోవడంతో బాధితుడు న్యాయం కోసం ఒంగోలు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ అనంతరం ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో బండ్ల గణేశ్‌ను దోషిగా తేల్చుతూ ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.95 లక్షల భారీ జరిమానా విధించారు. అంతేకాకుండా కేసు విచారణ నిమిత్తం బాధితుడికి అయిన న్యాయపరమైన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేశే భరించాలని తీర్పులో స్పష్టం చేశారు. కాగా, ఈ తీర్పుపై పైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు న్యాయస్థానం ఆయనకు నెల రోజుల గడువు ఇవ్వగా, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి గౌరవం ఉందని, చట్టబద్ధంగా తదుపరి న్యాయపోరాటం చేస్తానని బండ్ల గణేశ్ స్పందించారు.

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా చందనం తొలగింపు: 99.720 కిలోల చందనం భద్రపరిచిన అధికారులు



జగిత్యాల/మల్యాల, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి చందనోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం మూలవిరాట్‌కు అలంకరించిన చందనాన్ని అర్చకులు, అధికారులు శాస్త్రోక్తంగా తొలగించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ మరియు రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ) రామకృష్ణారావు ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహం నుంచి తొలగించిన చందనాన్ని తూకం వేయగా 99 కిలోల 720 గ్రాములు వచ్చింది. అనంతరం ఆ చందనానికి పంచనామా నిర్వహించిన అధికారులు, కట్టుదిట్టమైన భద్రతా చర్యల మధ్య సీల్ వేసి భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) అంజనా రెడ్డి, ప్రధానార్చకులు జితేంద్ర ప్రసాద్, చిరంజీవ స్వామి, మారుతీ ప్రసాద్, స్థానాచార్యులు కపిందర్, సహాయ కార్యనిర్వహణాధికారి హరిహరనాథ్, పర్యవేక్షకులు సునీల్ కుమార్, పరిశీలకులు అశోక్, లక్ష్మారెడ్డి, ఏఎస్ఐ రామయ్య మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో అమానుషం: మాయమాటలతో మహిళను నమ్మించి గదికి తీసుకెళ్లి ఇద్దరు వ్యక్తుల దారుణం.. నిందితుల అరెస్ట్

హైదరాబాద్/అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): హైదరాబాద్ నగర శివారులో ఓ వివాహితను మాయమాటలతో నమ్మించి, మత్తుమందు కలిపిన శీతలపానీయం ఇచ్చి ఇద్దరు వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హయత్‌నగర్‌లో తన కుటుంబంతో కలిసి నివాసముంటున్న బాధితురాలు తన కుమారుడిని పాఠశాల బస్సు ఎక్కించి తిరిగి ఇంటికి వస్తుండగా, పరిచయస్తుడైన సయ్యద్ జావీద్ ఆమెను అడ్డగించి తల్లిదండ్రులకు తీవ్ర అనారోగ్యంగా ఉందని నమ్మించాడు. వారి వద్దకు తీసుకెళ్తానని ఆటోలో ఎక్కించుకుని మార్గమధ్యలో మత్తుమందు కలిపిన శీతలపానీయం తాగించడంతో బాధితురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఆమెకు మెలకువ వచ్చేసరికి ఒక గదిలో చున్నీతో చేతులు కట్టేసిన స్థితిలో ఉండగా, అక్కడ సయ్యద్ జావీద్‌తో పాటు వెంకటేశ్ అనే మరో వ్యక్తి ఉన్నట్లు గుర్తించింది. నిందితులిద్దరూ కలిసి ఆమెపై అత్యాచారానికి పాల్పడి అక్కడి నుంచి పరారవగా, అనంతరం బాధితురాలు ఎలాగోలా బయటకు వచ్చి తన తల్లి వద్దకు చేరుకుని జరిగిన దారుణాన్ని వివరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, ఈ దారుణానికి పాల్పడిన నిందితులు సయ్యద్ జావీద్ మరియు వెంకటేశ్‌లను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.




లంచం సొమ్ము.. వైన్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు: మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణి అక్రమాస్తుల విలువ రూ.50 కోట్లు

హైదరాబాద్/రంగారెడ్డి, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా సంపాదించిన సొమ్మును మద్యం దుకాణాలు, షేర్ మార్కెట్, స్థిరాస్తులు మరియు బంగారంపై పెట్టుబడులుగా పెట్టిన మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిణి (టీపీవో) గుండు వాణి అక్రమాస్తుల గుట్టును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రట్టు చేశారు. గత సెప్టెంబరు 30న మొయినాబాద్ పరిధిలో ఓ నిర్మాణానికి సంబంధించి రూ.75 వేల లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్‌తో కలిసి ఏసీబీకి చిక్కి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వాణిపై తాజాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులు, సోమవారం ఆమె నివాసం, కార్యాలయం, బంధువులు, సన్నిహితులు, బినామీలకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.6.76 కోట్లు, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.50 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు అధికారులు కొనసాగిస్తున్నారు. వెల్లడించారు. గుర్తించిన స్థిరాస్తుల్లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 283.11 చదరపు గజాల ప్లాట్, జనగామ జిల్లా పాలకుర్తిలో 424 చదరపు గజాల ప్లాట్ (మొత్తం విలువ రూ.87.67 లక్షలు), రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌లో రూ.63 లక్షల విలువైన నివాస ఫ్లాట్, అదే ప్రాంతంలో రూ.2.45 కోట్ల విలువైన జీ+2 అంతస్తుల భవనం, మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలంలో రూ.29.70 లక్షల విలువైన ఎకరం 10 గుంటల వ్యవసాయ భూమి ఉన్నాయి. అలాగే చరాస్తుల విషయానికి వస్తే మహబూబ్‌నగర్‌లోని తుల్జాభవానీ వైన్స్‌లో రూ.50 లక్షల పెట్టుబడి, షేర్ మార్కెట్‌లో రూ.1.30 కోట్ల పెట్టుబడులు, రూ.5.47 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.7.97 లక్షలు, 175.1 గ్రాముల బంగారు ఆభరణాలు, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, హ్యుందాయ్ క్రెటా కార్లు సహా రెండు ద్విచక్ర వాహనాలు (విలువ రూ.50 లక్షలు) మరియు రూ.5.10 లక్షల విలువైన గృహోపకరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు

వేములవాడ రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులపై వివాదం: గర్భగుడి శిఖరం తొలగింపు యత్నాలపై భక్తుల ఆగ్రహం



వేములవాడ, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రారంభానికి ముందు గర్భగుడిని ఎట్టిపరిస్థితుల్లోనూ ముట్టుకోబోమని అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చి, ఇప్పుడు గర్భగుడి శిఖరాన్ని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ స్థానికులు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఇచ్చిన మాట తప్పి గర్భగుడి శిఖరాన్ని తొలగించేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులను వారు నిలదీశారు. మరోవైపు ఈ వివాదంపై ఆలయ ప్రధాన అర్చకుడు శరత్ శర్మ స్పందిస్తూ, గర్భగుడిపై ఉన్న శిఖరం భక్తులకు దూరం నుంచి కూడా స్పష్టంగా దర్శనమిచ్చేలా మరింత ఎత్తుగా, ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం నిర్మించాలంటూ శృంగేరి పీఠం నుంచి ఆదేశాలు వచ్చాయని, ఆ ఆదేశాల్లో భాగంగానే ఈ పనులు ప్రారంభించామని వెల్లడించారు.



ఫ్లైట్ టికెట్ పేరుతో నటి గోగినేని అనితకు సైబర్ వల: రూ.4.14 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): అమెరికాకు విమాన టికెట్ బుక్ చేసే పేరుతో సినీ నటి గోగినేని అనితను సైబర్ నేరగాళ్లు నిలువునా మోసగించి రూ.4.14 లక్షలు కాజేశారు. తన కుమారుడి పుట్టినరోజు వేడుకల నిమిత్తం అమెరికా వెళ్లేందుకు సిద్ధమైన నటి అనిత, విమాన టికెట్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో ట్రావెల్ ఏజెంట్ల వివరాల కోసం వెతికారు. ఈ క్రమంలో 'లో ఫ్లై టూర్స్ అండ్ ట్రావెల్స్' ప్రతినిధిని అంటూ రాజేష్ అనే వ్యక్తి ఆమెను సంప్రదించి, బిజినెస్ క్లాస్ టికెట్ ధర రూ.4,14,180 అవుతుందని నమ్మించాడు. అతని మాటలను విశ్వసించిన అనిత, టికెట్ బుకింగ్ ప్రక్రియ కోసం తన డెబిట్ కార్డు వివరాలతో పాటు ఫోన్‌కు వచ్చిన ఓటీపీని కూడా అతనికి చెప్పారు. దీంతో క్షణాల్లోనే 'క్లియర్ ట్రిప్' పేరిట ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.4,14,180 డ్రా అయ్యాయి. అయితే ఖాతాలో నుంచి నగదు కట్ అయినప్పటికీ ఎంతసేపటికీ టికెట్ బుకింగ్ వివరాలు రాకపోవడంతో తాను సైబర్ వలలో చిక్కుకుని మోసపోయానని గ్రహించిన నటి వెంటనే పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకునేందుకు దర్యాప్తు చేపట్టారు.

ఇన్సూరెన్స్ సంస్థ వాదనను తోసిపుచ్చిన తెలంగాణ హైకోర్టు: 2015 కారు ప్రమాద బాధితుడికి 9 శాతం వడ్డీతో రూ.2.67 కోట్ల పరిహారం చెల్లించాలని ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): కారులో ప్రయాణిస్తున్న వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని, థర్డ్ పార్టీ కింద బీమా పరిహారం చెల్లించడం కుదరదంటూ ఇన్సూరెన్స్ సంస్థ చేసిన వాదనను తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చి, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన బాధితుడికి అండగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎస్. నరేందర్ రెడ్డి 2015 మార్చి 29న తన తండ్రి పేరిట ఉన్న కారులో బోధన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా, రాత్రి 10 గంటల సమయంలో చేగుంట సమీపంలో కారు నడుపుతున్న అతని అన్న జలంధర్ రెడ్డి అదుపుతప్పి డీసీఎం వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు వెనుక సీటులో కూర్చున్న నరేందర్ రెడ్డికి తీవ్ర గాయాలై పూర్తిగా మంచానికే పరిమితమవడంతో, ఇన్సూరెన్స్ సంస్థ నుంచి రూ.4 కోట్ల పరిహారం ఇప్పించాలని కోరుతూ అతని భార్య సింధురాణి 2015లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ట్రిబ్యునల్ బాధితుడికి రూ.4.17 కోట్ల పరిహారం ప్రకటించగా, కారులో ఉన్న వారంతా ఒకే కుటుంబ సభ్యులైనందున థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ డబ్బు చెల్లించడం కుదరదంటూ బీమా సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. 2024 నవంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ కేసుపై తాజాగా విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి, అంబులెన్స్‌లో కోర్టు ఆవరణకు తీసుకువచ్చిన బాధితుడు నరేందర్ రెడ్డి పరిస్థితిని ప్రత్యక్షంగా చూసి, అతను 100 శాతం పని చేయలేని స్థితిలో ఉన్నాడని నిర్ధారిస్తూ ఇన్సూరెన్స్ సంస్థకు 9 శాతం వడ్డీతో కలిపి రూ.2.67 కోట్ల పరిహారాన్ని చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఈ నేపథ్యంలో వాహనదారులు ఇన్సూరెన్స్ సంస్థ వద్ద పాలసీ తీసుకునేటప్పుడు నిబంధనలను పూర్తిగా చదివి, సమగ్ర అవగాహనతో పాలసీ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై రాజకీయ దుమారం: కాంగ్రెస్ క్రమశిక్షణ చర్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తాజా సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా, ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ అనుసరిస్తున్న వైఖరిపై ప్రతిపక్షాలు, బీసీ సంఘాలు మరియు రాజకీయ విశ్లేషకులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఉన్న హైదరాబాద్ నగరానికే గతి లేకపోతే కొత్తగా 'ఫ్యూచర్ సిటీ' ఎందుకని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించిన రాజగోపాల్ రెడ్డి, ముఖ్యమంత్రి భాషను తప్పుబడుతూ 'నువ్వేం ముఖ్యమంత్రివి, పండబెట్టి తొక్కుతా అనడం ఏంటి, మునుగోడు నిధులు ఆపితే మరో చరిత్ర సృష్టిస్తా' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత క్రమశిక్షణ అందరికీ సమానంగా అమలవుతోందా లేదా అనే అంశంపై రాజకీయ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన లెక్కలు తప్పంటూ ప్రతులను దహనం చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ అధిష్ఠానం తక్షణమే సస్పెన్షన్ వేటు వేసిందని, అయితే ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వంటి నేతలు పలుమార్లు ముఖ్యమంత్రిపై పరోక్షంగా, ప్రత్యక్షంగా విమర్శలు గుప్పించినప్పటికీ పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీసీ సంఘాల నాయకులు, విపక్షాలు విమర్శిస్తున్నాయి. పార్టీలో ఒకరికి ఒక న్యాయం, బీసీ నేతలకు మరో న్యాయం అమలవుతోందా అంటూ రాజకీయ పరిశీలకులు ప్రశ్నిస్తుండగా, రాజగోపాల్ రెడ్డి తాజా వ్యాఖ్యలపై టీపీసీసీ నాయకత్వం మరియు క్రమశిక్షణా కమిటీ ఏ విధంగా స్పందిస్తుందోనని రాష్ట్ర రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

హైదరాబాద్ టోలిచౌకి పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ కలకలం: లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సీఐ రమేష్ నాయక్



హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): హైదరాబాద్ నగరంలోని టోలిచౌకి పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించడం పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ఒక కేసు వ్యవహారంలో బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా టోలిచౌకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) రమేష్ నాయక్‌ను ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం టోలిచౌకి పోలీస్ స్టేషన్‌లో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తూ కేసులకు సంబంధించిన కీలక రికార్డులు, దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. కాగా, ఈ ఘటనకు సంబంధించి లంచం మొత్తం ఎంత, ఏ కేసుకు సంబంధించి సీఐ లంచం డిమాండ్ చేశారు అనే పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉండగా, సోదాలు మరియు విచారణ ప్రక్రియ పూర్తయిన అనంతరం నిందితుడైన సీఐ రమేష్ నాయక్‌ను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా విధుల నిర్వహణలో లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏమాత్రం భయపడకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు గానీ, వాట్సాప్ నంబర్ 9440446106కు గానీ సమాచారం అందించాలని, ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు.



హైదరాబాద్ నగర కొత్త సీపీ మహేష్ భగవత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సైబరాబాద్, మల్కాజిగిరి సీపీలు

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ మరియు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. ఈ భేటీ సందర్భంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ మహేష్ భగవత్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన భద్రతను అందించేందుకు మూడు పోలీస్ కమిషనరేట్లు (హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి) పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన ప్రాధాన్యతను నొక్కిచెప్పారు. సహాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే పౌరులకు ఎలాంటి జ్యూరిస్డిక్షన్ (అధికార పరిధి) సమస్యలు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. అందరి సంయుక్త కృషితో తెలంగాణ పోలీస్ శాఖకు మరియు ప్రభుత్వానికి మరింత మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు అంకితభావంతో పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి రూ.కోటి విరాళం అందజేసిన అరోబిందో ఫార్మా ఫౌండేషన్



హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ మౌలిక వసతుల అభివృద్ధి కోసం అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళాన్ని ప్రకటించగా, ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌కు అందజేశారు. అరోబిందో ఫార్మా లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మరియు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ కె. నిత్యానంద రెడ్డి తరపున ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ ఎస్. సదానంద రెడ్డి, అరోబిందో ఫార్మా కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఐ.ఎస్.ఆర్. రావు డీజీపీకి ఈ చెక్కును అందజేయగా, ఈ విరాళం అందడంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్, సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఫౌండేషన్‌తో సంప్రదింపులు జరిపారు. ఈ ఆర్థిక సాయం ద్వారా పాఠశాలలో మెరుగైన విద్యా సదుపాయాల కల్పన, మౌలిక వసతుల బలోపేతం మరియు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర అభివృద్ధికి అవసరమైన అవకాశాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సి.వి. ఆనంద్, మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్, ఏడీజీ (శాంతిభద్రతలు) అకున్ సబర్వాల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్వాన్ తుఫాన్ ప్రభావం: రేపు శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లో పాఠశాలలకు సెలవు ప్రకటన

శ్రీకాకుళం/పలాస, నవంబర్ 18, సందేశం టైమ్స్ (ప్రతినిధి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుఫాన్ ముప్పు పొంచివున్న నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు పలాస డివిజన్ పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు గురువారం (నవంబర్ 19, 2026) ఒక్క రోజు సెలవు ప్రకటిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఉత్తర్వులు జారీ చేశారు. తుఫాన్ పరిస్థితులు, భారీ వర్షాల హెచ్చరికలరీత్యా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ప్రైవేటు మరియు రెసిడెన్షియల్ పాఠశాలలన్నింటికీ ఈ పరిహార సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పలాస డివిజన్ ఉప విద్యాశాఖాధికారి (డీఈఓ), మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు) తమ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ ఆదేశాలను చేరవేసి, సెలవు కచ్చితంగా అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైల్వే కోడూరు గర్ల్స్ హైస్కూల్ వద్ద చెత్తాచెదారంపై మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి: తక్షణమే శుభ్రం చేయాలని తిరుపతి కలెక్టర్‌కు ఆదేశం



తిరుపతి/రైల్వే కోడూరు, నవంబర్ 18, సందేశం టైమ్స్ (ప్రతినిధి): తిరుపతి జిల్లా రైల్వే కోడూరులోని ఓ బాలికల పాఠశాల వెలుపల భారీగా పేరుకుపోయిన చెత్తాచెదారం కారణంగా విద్యార్థినిలు తరగతుల్లో పాల్గొనేందుకు పడుతున్న ఇబ్బందికర పరిస్థితులపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మన పిల్లలు తరగతి గదుల్లోనూ, బడికి వెళ్లే దారిలోనూ ఎల్లప్పుడూ పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని పొందే అర్హత కలిగి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యపై తిరుపతి జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, వెంటనే ఆ ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేయించాలని ఆదేశించారు. కేవలం ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయడమే కాకుండా, ఈ సమస్య మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు స్థానిక కమ్యూనిటీలతో కలిసి అధికారులు పౌర స్పృహ (సివిక్ సెన్స్) పట్ల అవగాహన కల్పించేలా కృషి చేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

ఏపీ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ ముసాయిదా సీనియారిటీ జాబితా విడుదల: అభ్యంతరాల స్వీకరణకు అయిదు రోజుల గడువు



PRESIDENTIAL ORDER, 2025-MULTI ZONAL CADRE

PROCEEDINGS OF THE MEMBER-CONVENOR OF THE SECRETARIAT LEVEL IMPLEMENTATION COMMITTEE & DIRECTOR OF SCHOOL EDUCATION ANDHRA PRADESH

Present: Smt.Thameem Ansariya A., I.A.S.,

Rc.No.ESE/02/1701/2026-APMS (EST 1)-CSE Dt:19-11-2026

Sub: School Education Department – A.P.Model Schools – Andhra Pradesh Public Employment (Organisation of Local Cadres and Regulation of Direct Recruitment) Order, 2025 – Allotment of personnel to Multi-Zonal Cadres – Draft Seniority List (DSL) of Principals working in A.P.Model Schools – Communicated – Objections/corrections called for – Regarding.

Read: 1) Andhra Pradesh Public Employment (Organisation of Local Cadres and Regulation of Direct Recruitment) Order, 2025 – S.O.5777(E), Dt:15.12.2025 (Gazette of India, Extraordinary).
2) G.O.Ms.No.45, General Administration (SPF&MC) Dept., Dt:20.04.2026.
3) G.O.Ms.No.54, General Administration (SPF&MC) Dept., Dt:14.05.2026.
4) Circular Memo No.256656/SSPFMC/2026, Dt:09.06.2026 of the General Administration (Ser.&HRM) Dept., GoAP.
5) G.O.Ms.No.46, Finance (HR.I-Pig. & Policy) Dept., Dt:06.07.2026.
6) G.O.Ms.No.129, General Administration (SPF&MC) Dept., Dt:17.07.2026.
7) G.O.Ms.No.133, School Education (General) Dept., Dt:06.08.2026.
8) Govt. Memo No.3363883/Ser.II/A.2/2026, dated 30.09.2026 of the School Education Department, GoAP.
9) G.O.Ms.No.212, General Administration (SPF&MC) Dept., Dt:10.10.2026.
10) G.O.Ms.No.143, Finance (HR.I-Creation-Upgrade-Posts) Dept., Dt:16.10.2026.
11) G.O.Ms.No.47 School Education (PROG.III) Department Dt:03.11.2026.
12) Draft Seniority List of the Principals of AP Model Schools.

&&&&

ORDER:

The Draft Seniority List of Principals working in A.P.Model Schools is hereby communicated to all the individuals concerned through the respective Regional Joint Directors of School Education in the State. The said Draft Seniority List has been prepared and is being communicated exclusively for the purpose of allotment of personnel to the respective Local Cadres in accordance with the Andhra Pradesh Public Employment (Organisation of Local Cadres and Regulation of Direct Recruitment) Order, 2025 and the guidelines issued thereunder. It shall not be treated as a determination or finalisation of the regular/service seniority of the employees concerned.

2. The individuals concerned are hereby instructed to examine the particulars furnished in the Draft Seniority List and submit their objections/corrections, if any, within five (5) days from the date of receipt of these proceedings, through the

అమరావతి, నవంబర్ 18, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (స్థానిక కేడర్ల వ్యవస్థీకరణ మరియు ప్రత్యక్ష నియామకాల క్రమబద్ధీకరణ) ఉత్తర్వులు-2025 మరియు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్ ముసాయిదా సీనియారిటీ జాబితాను (డ్రాఫ్ట్ సీనియారిటీ లిస్ట్) పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మరియు సెక్రటేరియట్ స్థాయి అమలు కమిటీ సభ్య-కన్వీనర్ ఎస్. తమీమ్ అన్సారియా ఐ.ఏ.ఎస్. బుధవారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ జీవోలు మరియు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం మల్టీ-జోనల్ కేడర్లకు సిబ్బంది కేటాయింపు నిమిత్తం ప్రత్యేకంగా ఈ ముసాయిదా సీనియారిటీ జాబితాను రూపొందించినట్లు ఉత్తర్వులలో స్పష్టం చేశారు. కేవలం కేడర్ల కేటాయింపు ప్రక్రియ కోసమే రూపొందించిన ఈ జాబితాను ఉద్యోగుల రెగ్యులర్/సర్వీస్ సీనియారిటీగా పరిగణించబోమని పేర్కొన్నారు. సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ అందరూ తమ వివరాలను పరిశీలించుకుని, జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే ఈ ఉత్తర్వులు అందుకున్న తేదీ నుండి ఐదు రోజులలోపు సరైన ఛానెల్ ద్వారా seapmsmultizonalpo2025@gmail.com ఈ-మెయిల్ ఐడీకి పంపాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా ఎలాంటి అభ్యంతరాలు అందకపోతే, సంబంధిత వ్యక్తులకు ఎలాంటి అభ్యంతరాలు లేనట్లు భావించి అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తుది జాబితాను ఖరారు చేసి స్థానిక కేడర్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు.

తెలంగాణలో రియల్ ఎస్టేట్ సంస్థల మోసాలపై టీజీ రెరా ఉక్కుపాదం: నిబంధనలు ఉల్లంఘించిన 8 సంస్థలపై జరిమానాలు, రిఫండ్స్‌కు ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): తెలంగాణలో రియల్ ఎస్టేట్ సంస్థల నిర్లక్ష్యం మరియు కొనుగోలుదారుల మోసాలపై తీవ్రంగా స్పందించిన తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ మండలి (TG RERA) నిర్మాణాల్లో తీవ్ర జాప్యం, సరైన అనుమతులు లేకుండా ప్రాజెక్టులు చేపట్టడం, డబ్బులు చెల్లించినప్పటికీ ఫ్లాట్లు అప్పగించకపోవడం మరియు కొనుగోలుదారులు కోరినప్పుడు రిఫండ్లు ఇవ్వడంలో విఫలమైన మొత్తం 8 ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలపై ఉక్కుపాదం మోపుతూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది; ఇందులో భాగంగా మంచిరేవులలోని 'సనాలి ది ఎడ్జ్' ప్రాజెక్టుకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా విక్రయాలు చేపట్టిన సనాలి ఐటీ పార్క్స్‌కు రూ.25 లక్షల భారీ జరిమానా విధించడమే కాక రిజిస్ట్రేషన్ వచ్చే వరకు అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించగా, శ్రీ ఆదిత్య స్క్వేర్స్, త్రిపుర కన్స్ట్రక్షన్స్, వాసవి రియల్టర్స్, ఎస్‌వీఎం ఆదిత్య హోమ్స్, అరైన్ ఇన్‌ఫ్రా, బీవీఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ మరియు భువన్తేజ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ సంస్థలకు చెందిన వివిధ వివాదాల్లో బాధితులకు వడ్డీతో సహా రిఫండ్లు చెల్లించాలని మరియు ఆయా ఫ్లాట్లను వెంటనే స్వాధీనం చేయాలని స్పష్టమైన తీర్పునిచ్చింది; భవిష్యత్తులో ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తే రెరా చట్టం-2016లోని సెక్షన్ 63 ప్రకారం మరింత కఠినమైన అదనపు జరిమానాలు విధిస్తామని హెచ్చరించిన కౌన్సిల్, ప్రజలు ఎవరైనా ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు చేసే ముందు ప్రాజెక్టు రెరా రిజిస్ట్రేషన్, ప్రభుత్వ అనుమతులను తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించింది.

ఎస్సీఈఆర్టీ కీలక ఉత్తర్వులు: ఈ నెల 21, 28 తేదీల్లో క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు.. తేదీలు, వివరాలు వెల్లడించిన విద్యాశాఖ

అమరావతి, నవంబర్ 18, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ఉపాధ్యాయులకు నిరంతర విద్యాపరమైన మద్దతును అందించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (SCERT) నవంబర్ నెలలో నిర్వహించనున్న క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం. వెంకట కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేస్తూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్జేడీలు, డీఈవోలు, ఏపీసీలు మరియు డైట్ ప్రిన్సిపాల్స్ ఈ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 21వ తేదీన మూడో శనివారం రోజున ప్రైమరీ (ఎస్‌జీటీలు) మరియు సెకండరీ స్కూల్ అసిస్టెంట్స్ (నాన్-లాంగ్వేజెస్ - మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్) ఉపాధ్యాయులకు, అలాగే నవంబర్ 28వ తేదీన నాలుగో శనివారం రోజున ప్రైమరీ (ఎస్‌జీటీలు), సెకండరీ స్కూల్ అసిస్టెంట్స్ (లాంగ్వేజెస్ - తెలుగు, హిందీ, ఆంగ్లం) మరియు పీఈటీలు/ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు ఈ సమావేశాలు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఎలాంటి విచలనాలు లేకుండా నిర్వహించనున్నారు. అకాడమిక్ ప్రగతి సమీక్ష, అభ్యాసన అంతరాలను గుర్తించడం, అభ్యాసన ఫలితాలు, కఠినమైన భావనలపై చర్చ, సహకార పాఠ్య ప్రణాళిక రూపకల్పన, నమూనా బోధనలు, ఉపాధ్యాయుల మరియు విద్యార్థుల హాజరు, బడిబయటి పిల్లల గుర్తింపు, పీర్ గ్రూప్ లెర్నింగ్ మరియు స్కూల్ వారీగా అకడమిక్ యాక్షన్ ప్లాన్ తయారీ వంటి అంశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించనున్నారు. సమావేశాల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలు మరియు అజెండానుయాజమాన్యాలు, సంబంధిత అధికారులకు చేరవేయాలని ఎస్సీఈఆర్టీ స్పష్టం చేసింది.

తిరుపతిలో 5 వేల ఎకరాలతో భారీ 'సెమీకండక్టర్ పార్క్': మూడు కొత్త సంస్థల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మంత్రి నారా లోకేష్

అమరావతి/తిరుపతి, నవంబర్ 18, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఎలక్ట్రానిక్స్ మరియు సెమీకండక్టర్ రంగాలకు హబ్‌గా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన అడుగులు వేస్తోందని, అందులో భాగంగా తిరుపతిలో సుమారు 5 వేల ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన 'సెమీకండక్టర్ పార్క్'ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ఈ ప్రత్యేక పార్క్‌లో సెమీకండక్టర్ పరిశ్రమలకు అత్యంత కీలకమైన క్లీన్‌రూమ్స్, అడ్వాన్స్‌డ్ టెస్టింగ్ ల్యాబ్‌లు మరియు అల్ట్రా ప్యూర్ వాటర్ సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుందని తెలిపారు. పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీలకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున 100 శాతం మ్యాచింగ్ గ్రాంట్‌ను అందజేస్తామని, అలాగే పరిశ్రమల స్థాపనకు ఎలాంటి ఆలస్యం జరగకుండా 'సింగిల్ విండో' విధానం ద్వారా అన్ని రకాల అనుమతులను వేగవంతంగా మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ రంగానికి కావలసిన నైపుణ్యంతో కూడిన మానవ వనరులను తయారు చేసేందుకు ప్రత్యేకంగా 'AP-STCC ట్రైనింగ్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సెమీకండక్టర్ పార్క్‌లో తొలి విడతగా మూడు నూతన ప్రముఖ సంస్థలు తమ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయని, దీని ద్వారా రాష్ట్రంలో వేలాది మంది యువతకు నైపుణ్యంతో కూడిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఏపీ పారిశ్రామిక రంగంలో చరిత్రాత్మక మార్పులు వస్తాయని మంత్రి నారా లోకేష్ ధీమా వ్యక్తం చేశారు.

ఐపీఎల్‌కు మహేంద్రసింగ్ ధోనీ గుడ్‌బై: చెన్నై సూపర్ కింగ్స్ మెంటార్‌గా మహీ నియామకం



చెన్నై, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): భారత క్రికెట్ దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్ (CSK) లెజెండరీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ ఆటగాడిగా తన ప్రస్థానానికి అధికారికంగా వీడ్కోలు పలికారు; ఈ నేపథ్యంలోనే సీఎస్కే యాజమాన్యం ఆయనను సరికొత్త బాధ్యతలో నియమిస్తూ, ఇకపై జట్టుకు 'మెంటార్' (సలహాదారుడు, మార్గదర్శకుడు)గా వ్యవహరిస్తారని అధికారికంగా ప్రకటించింది; తన అద్భుతమైన కెప్టెన్సీతో సీఎస్కే జట్టును ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించిన ధోనీ, ఆటగాడిగా తప్పుకున్నప్పటికీ ఫ్రాంచైజీతో తన ప్రత్యేక అనుబంధాన్ని కొనసాగిస్తూ రాబోయే రోజుల్లో యువ ఆటగాళ్లకు తన అనుభవంతో మార్గనిర్దేశం చేయనున్నారు; ధోనీ రూపంలో అత్యుత్తమ మెంటార్ లభించడం తమ జట్టుకు మరింత బలాన్ని చేకూరుస్తుందని, ఆయన నాయకత్వ లక్షణాలు యువ క్రికెటర్లను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు దోహదపడతాయని సీఎస్కే యాజమాన్యం ధీమా వ్యక్తం చేసింది.



ఆన్‌లైన్ మందుల విక్రయాలపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం: నిబంధనలు ఉల్లంఘించిన 23 ఫార్మసీల లైసెన్సులు సస్పెండ్

హైదరాబాద్, నవంబర్ 19, సందేశం టైమ్స్ (ప్రతినిధి): ఆన్‌లైన్ ద్వారా మందులను విక్రయించే ప్రముఖ ఈ-కామర్స్ మరియు డెలివరీ సంస్థలకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA) అధికారులు ఉక్కుపాదం మోపారు; నిబంధనలకు విరుద్ధంగా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940ని ఉల్లంఘించినట్లు గుర్తించి, ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లతో భాగస్వామ్యం కలిగి ఉన్న మొత్తం 23 ఫార్మసీలను సస్పెండ్ చేయగా, మరో 9 ఫార్మసీలకు హెచ్చరికలు జారీ చేశారు; అక్టోబర్ 28న అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా 'టాటా 1ఎంజీ (Tata 1mg), నెట్‌మెడ్స్ (Netmeds), జెప్టో (Zepto), అపోలో 24/7 (Apollo 24/7), మెడ్‌ప్లస్ మార్ట్ (MedPlus Mart), ఇన్‌స్టామార్ట్ (Instamart)' తదితర సంస్థలతో అనుసంధానమైన పలు మెడికల్ షాపుల్లో రికార్డులను, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు; ఈ తనిఖీల ఆధారంగా 15 ఫార్మసీలను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పూర్తిగా సస్పెండ్ చేయగా, మరో 8 ఫార్మసీలపై నిర్దిష్ట కాలపరిమితితో సస్పెన్షన్ వేటు వేశారు; ఆన్‌లైన్‌లో మందులు విక్రయించేటప్పుడు కచ్చితంగా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణ ఉండాలని, వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ మందులు ఇవ్వకూడదని అధికారులు స్పష్టం చేశారు; అక్రమంగా మందులు విక్రయిస్తున్నట్లు ఎవరికైనా సమాచారం తెలిస్తే 'టీజీ సేఫ్' (TG SAFE) టోల్ ఫ్రీ నంబర్ 1800-599-6969 (పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు) ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.